క్లుప్తంగా

శ్రీవారికి భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో కొలువై ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి షష్టమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఊంజల్ సేవ, ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు టీపీ వెంకటేశ్వర్లు, కొండలరావు, నిట్టూరి వెంకట రమేష్, పిచ్చీరావు, రామారావు, రాజా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

కంభం ఎంపీడీఓగా అరుణాదేవి



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణాదేవి

కంభం: ఎంపీడీఓగా కె.అరుణాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాచర్ల ఎంపీడీఓగా పనిచేస్తూ సెలవుల్లో ఉన్న ఆమెను కంభం ఎంపీడీఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో ఆమె గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

వైభవంగా సీతారామస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో పట్టాభి సీతారామస్వామి

తర్లుపాడు: మండలంలోని కారుమానుపల్లిలో పట్టాభి సీతారామస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చన, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం, సాయంత్రం అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి తువ్వపాడులో పండగ మహోత్సవాలు



ముస్తాబైన రామాలయం

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు(దక్షిణంపల్లి) గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సహిత రామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం గంగానయనం, గోపూజ, గణపతి పూజా కార్యక్రమాలతోపాటు సీతారామచంద్ర మూర్తులకు శాంతి కల్యాణం నిర్వహిస్తారన్నారు. శనివారం ఆంజనేయస్వామి ఉత్సవం, సాయంత్రం కుంకుమ బండ్ల ఉత్సవం, ఆదివారం పోలేరమ్మ తల్లికి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు గ్రామంలో అన్నదానం నిర్వహిస్తారన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



స్టూడెంట్ కిట్లు అందిస్తున్న హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, కందుల రామిరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.రామిరెడ్డి మాట్లాడుతూ.. తాను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకలైనా.. దప్పికైనా.. అవస్థే..!

- మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో మూతపడిన క్యాంటీన్
- బస్టాండ్ నుంచి రోజూ 200 బస్సుల రాకపోకలు
- టీ, టిఫిన్, భోజనం లేక ప్రయాణికుల ఇబ్బందులు



మార్కాపురం ఆర్టీసీ బస్టాండులో మూతపడిన క్యాంటిన్

మార్కాపురం టౌన్: డివిజన్ కేంద్రమైన మార్కాపురం ఆర్టీసీ బస్టాండులో క్యాంటీన్ మూతపడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కాపురం డిపోలో ఉండే 98 బస్సులతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఒంగోలు, విజయవాడ, తిరుపతి, కడప, కర్నూలు,శ్రీశైలం, అనంతపురం, పుట్టపర్తి, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి రోజూ 100 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఉదయం పూట టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం తినేందుకు బస్టాండ్ బయట ఉండే హోటళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వారు ప్రయాణికుల నుంచి అధిక ధర వసూలు చేస్తున్నారు. ప్రధానంగా చంటి పిల్లల తల్లిదండ్రులు పాల కోసం అవస్థలు పడుతున్నారు. అర్ధరాత్రి ప్రయాణించే డ్రైవర్లు బస్టాండ్‌లో బస్సు ఆపగానే నిద్రమత్తు పోయేందుకు టీ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. తెల్లవారుజామున శ్రీశైలం, విజయవాడకు వెళ్లే బస్సు దూర ప్రాంతాల నుంచి వస్తాయి. ఆ సమయంలో బస్టాండులో టీ కూడా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో డ్రైవర్లు త్రిపురాంతకం, వినుకొండ ప్రాంతాల్లో భోజనం, టిఫిన్ల కోసం ఉదయం, రాత్రి సమయాల్లో బస్సులు నిలుపుతున్నారు. జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ అధికారులు స్పందించి మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మట్టినమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మెర్సీ

పొలం స్వభావం ఆధారంగా ఎరువులు వాడాలి

బేస్తవారిపేట: రైతులు తప్పనిసరిగా పొలంలో మట్టిని పరీక్ష చేయించుకోవాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ అన్నారు. గురువారం మండలంలోని బసినేపల్లె మట్టి నమూనా సేకరణ, మట్టి నమూనా ఆవశ్యకతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మట్టి నమూనా ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఖర్చు తగ్గడమే కాకుండా భూమిని రక్షించవచ్చన్నారు. మండలంలో 662 మట్టి నమూనాలను సేకరించి ఒంగోలు ల్యాబ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. మట్టి నమూనాలను తీసుకోవాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. గ్రామ ఉద్యానవన సహాయకురాలు వై.లక్ష్మి పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘ నాయకులు

బేస్తవారిపేట: రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘ గిద్దలూరు నియోజకవర్గ కార్యదర్శి ధాకాల పుల్లయ్య మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలను ఈ ఖరీఫ్ సీజన్‌లో అందించాలని, వడ్డీ లేకుండా రూ.3 లక్షల వరకు రుణాలు, రూ.5 లక్షలు పావలా వడ్డీతో ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గత రబీ కాలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతులకు వెంటనే చెల్లించాలన్నారు. రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలని, వ్యవసాయ పరికరాలను 50 శాతం సబ్సిడీపై అందించాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ 4, 5 విడుతల నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జె.అంకయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి జోసఫ్, ఏఐటీయూసీ కార్యదర్శి యోగయ్య, నాయకులు వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



సాయి సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూబజారులో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. వచ్చే 21 వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. గురువారం ఉదయం 7 గంటలకు సాయి ఏకాహం భజనలను మందిర అధ్యక్ష్య కార్యదర్శులు గోపాలుని హరిహరరావు, పేరం సత్యనారాయణ ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 7 గంటల వరకు షిరిడీ సాయి మహిళా సేవా సమాజ్ బృందం ఆధ్వర్యంలో ఏకాహం భజన నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు బాబా మందిరంలో బాబా జీవిత చరిత్రపై క్విజ్ కార్యక్రమం, 29 శనివారం సాయంత్రం 6 గంటలకు భక్తిగీతాల పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 30న ఉదయం 9 గంటల నుంచి జూలై 3వ తేదీ వరకూ సాయి భక్తులతో పట్టణంలో సాయిభిక్ష నిర్వహిస్తున్నామని, సాయి భక్తులు పాల్గొనాలని కోరారు. 4వ తేదీ నుంచి ప్రముఖ సాయితత్వ ప్రచారకులతో బాబా జీవిత చరిత్రపై ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. జూలై 11 నుంచి 18వ తేదీ వరకూ సాయిబాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం జరుగుతోందని తెలిపారు. 21న గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గోపాలుని కృష్ణమోహన్, రామడుగు వెంకట నాగగోపి, షేక్ కరీంబాషా, పీవీఎల్ఎన్‌వీ నాగరాజు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం బాబాను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, పూజలు చేశారు.

ప్రశంస పత్రాలు అందుకున్న కానిస్టేబుళ్లు





ఎస్పీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న మురళీకృష్ణ, నాగేశ్వరరావు

కొనకనమిట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన కొనకనమిట్ల పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుళ్లు ఇద్దరు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ చేతుల మీదుగా ప్రశంస పత్రం, అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుళ్లు బండి మురళీకృష్ణ, నాగేశ్వరరావును ఎస్సై మాధవరావు, ఏఎస్ఐ గోపాలకృష్ణ, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

నర్సరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



నర్సరీని తనిఖీ చేస్తున్న విష్ణుప్రియ



నర్సరీ యజమానులకు సూచనలు ఇస్తున్న శ్వేత

కొమరోలు: నర్సరీలకు తప్పనిసరిగా నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని గిద్దలూరు ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ తెలిపారు. మండలంలోని తాటిచెర్లమోటు గ్రామం వద్ద నర్సరీలను ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ చీడపురుగులు, తెగుళ్ల యాజమాన్యం చేసి నాణ్యమైన మొక్కలను రైతులకు అందించడమే నర్సరీల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చట్టపరంగా నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రభుత్వంచే లైసెన్సు పొందాలన్నారు. మొక్కలను నర్సరీ నిర్వాహకులు విక్రయించినపుడు రైతులకు తప్పనిసరిగా రసీదులు అందించాలన్నారు. తనిఖీల్లో భాగంగా లైసెన్సులేని నర్సరీలకు ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ నోటీసులు అందజేశారు.

అర్ధవీడు (బేస్తవారిపేట): అనుమతులు లేకుండా నర్సరీలను ఏర్పాటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత హెచ్చరించారు. గురువారం మండలంలోని కాకర్లలో నర్సరీలను ఆమె తనిఖీ చేశారు. నర్సరీ యజమానులు నాణ్యత, వ్యాధులు లేనటువంటి మొక్కలను రైతులకు సరఫరా చేయాలని తెలిపారు. నర్సరీల్లో ట్రేలు నింపేముందు కిలో వేపపిండి, కిలో ట్రైకోడెర్మా విరిడిని 300 కిలోల కోకోపిట్‌లో కలుపుకోవాలని సూచించారు. ట్రేలు భూమిని తాకకుండా ప్లాస్టిక్ షీట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారు మొక్కలను ప్రధాన పొలంలో నాటడానికి ముందు క్రమేపీ నీటి తడవడం తగ్గించాలన్నారు. నీటి తడవడం తగ్గించడంతో మొక్క ధృడపడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ లేని నర్సరీ యజమానులకు నోటీసులు అందచేశారు. కార్యక్రమంలో ఉద్యానవన విస్తరణాధికారి వైసీహెచ్ శేషగిరి, గ్రామ వ్యవసాయ సహాయకులు రమాదేవి పాల్గొన్నారు.

చినుకు జాడేది?



విత్తనం నాటేందుకు ఓ రైతు సిద్ధం చేసిన పొలం

పెద్దారవీడు: వానాకాలం వచ్చినా మబ్బులే తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. వ్యవసాయానికి అవసరమైన వర్షాలు లేకపోవడంతో రైతులు కొంతమేర ఆందోళన చెందుతున్నారు. అసలైన తొలకరి పలకరింపు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది జూన్‌లో ఒక మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఆరంభంలోనే వరుణ దేవుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనులు చేపట్టారు. కానీ ఈ ఏడాది వరుణుడి జాడే కనిపించడం లేదు. జూన్ నెలాఖరు వచ్చినా, కార్తెలు వెళ్లిపోతున్నా నేటికీ సరైన వర్షాలు కురవడం లేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలతో మండిపోతోంది. ఏప్రిల్, మే నెలల్లో సూర్యప్రతాపంలో అల్లాడిన ప్రజలు జూన్‌లో వర్షాలతో కొంత సేదతీరొచ్చని ఆశించారు. కానీ అది ప్రజలు, రైతులకు నిరాశే అవుతోంది. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. అంతేకాకుండా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు నమోదు అవుతున్నాయి. మండే ఎండలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరగడమేగాక రాత్రి పూట కూడా వాతావరణం వేడిగానే ఉంటోంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం ఇంకా కొనసాగుతూనే ఉంది. జూన్ నెల మొదటి వారంలో వర్షాలు ప్రారంభమై రెండో వారం నాటికి వాతావరణం పూర్తిగా చల్లబడాలి. కానీ ఇప్పటికీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులు పొలాలు సేద్యం చేసి విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఎస్‌వీకేపీలో అడ్మిషన్లు ప్రారంభించాలి



ప్రదర్శనలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో(ఎస్‌వీకేపీ) అడ్మిషన్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.విజయ్ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిరసన ప్రదర్శన చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి, పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్, నాయకులు వందనం, పవన్, సన్నీ, సుదర్శన్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

తాళ్లూరు (ముండ్లమూరు): పర్యావరణ పరిరక్షణలో బాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని వెలుగువారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకోవాలని సూచించారు.

వధూవరులకు బూచేపల్లి ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

దర్శి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు పీటీఎస్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మేడం మోహన్‌రెడ్డి మేనమామ పాలం రఘురామిరెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి వివాహ వేడుకలకు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వారి ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజయ్యారు.

రైతులకు సాగు సాయం అందజేయాలి

ముండ్లమూరు: రైతులకు సాగు సాయం అందజేయాలని ఏపీ రైతు సంఘం, సీపీఐ మండల కార్యదర్శి సుంకర అంజిరెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డికి రైతు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎన్నికల హామీల్లో భాగంగా టీడీపీ ఇస్తామన్న 20 వేల రూపాయలు సాగు సాయం తక్షణమే అందజేయాలని కోరారు. ఉత్పత్తుల ఖర్చులకు అణుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులకు వడ్డీలు లేని పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు బ్యాంక్ రుణాలు అందజేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, వ్యవసాయానికి అవసరమైన పరికరాలను 50 శాతం రాయితీపై అందజేయాలన్నారు. కల్తీ విత్తనాలు అరికట్టి కల్తీ వ్యాపారులపై ఉక్కు పాదం మోపాలని కోరారు. పొగాకు రైతులు పండించిన అదనపు పొగాకుకు ఫెనాల్టీలు విధించే ఆలోచనలు విరమించుకోవాలన్నారు. నష్ట పోయిన ఆహార పంటలకు ఎకరాకు ప్రతి రైతుకు రూ.30వేలు,వాణిజ్య పంటలకు రూ.70వేలు,ఉద్యానవన పంటలకు లక్షరూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. పంటల బీమా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తూ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘ నాయకులు ఎస్.బ్రహ్మానందరెడ్డి, వీరరాఘవులు, ఎం.కోటిరెడ్డి, సుంకర సుజాత, పద్మావతి, రాజేశ్వరిలు పాల్గొన్నారు.